
సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 6 । జూన్ । 2023



డెల్టాలకు 4150 క్యూసెక్కులు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 4,150 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు 1,100, సెంట్రల్ 50, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు.



భారీగా చదివింపులు

రాష్ట్ర ప్రభుత్వం విదేశాల్లో చదువుకునే వారికి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తోంది. అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుంది.

8లో

గరిష్టం/కనిష్టం
42.0° / 25.5°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	25.5
కాకినాడ	39.0	26.8
అమలాపురం	39.5	27.4

న్యూస్‌రీల్

459 మంది విద్యార్థుల గైర్హాజరు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): పదో తరగతి సప్లిమెంటరీలో భాగంగా సోమవారం ఇంగ్లిషు పరీక్ష జరిగింది. దీనికి జిల్లాలో 859 విద్యార్థులకు 400 మంది హాజరయ్యారు. 459 మంది పరీక్ష రాయలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఓ రెండు, తనిఖీ అధికారులు 17 కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి, పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

98.86 శాతం పింఛన్ల పంపిణీ



తాపేశ్వరం వెళ్ల పార్వతికి విడో పెన్షన్ అందిస్తున్న కోలమూరు వలంటీర్ గంగాధర్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో వైఎస్సార్ పింఛన్ కానుక 98.86 శాతం మేర పంపిణీ చేశారు. జిల్లాలోని 2,34,205 మందికి సామాజిక భద్రతా పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం రూ.64.56 కోట్లు విడుదల చేసింది. వీరిలో 2,31,527 మందికి వలంటీర్లు రూ.63.81 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేశారు.

12న విత్తన మహోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: ఈ నెల 12న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు లాం ఫాంలో 'విత్తన మహోత్సవం' నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం (ఏరువాక కేంద్రం) కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. విత్తన మహోత్సవంలో మార్టేరు, బాపట్ల, మచిలీపట్నం, నెల్లూరు వరి పరిశోధన స్థానాల్లో ఉత్పత్తి చేసిన వివిధ రకాల విత్తనాలతో పాటు మినుము, పెసర, శనగ, వేరుశనగ, నువ్వులు, రాగులు, కొర్రలు, జొన్న తదితర రకాల ప్రదర్శన, అమ్మకాలు చేపడుతున్నారని వివరించారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నందకిషోర్ కోరారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు 174 మంది హాజరు

రాజమహేంద్రవరం రూరల్: పాలిసెట్ కౌన్సెలింగ్‌లో చివరి రోజైన సోమవారం జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు 174 మంది హాజరయ్యారని బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పాలిసెట్ కన్వీనర్ వి.నాగేశ్వరరావు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సుల ఎంపికకు ఆప్షన్ల నమోదును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

17 వరకూ అతిసార నియంత్రణ పక్షోత్సవాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఈ నెల 17వ తేదీ వరకూ జిల్లాలో ఉధృతి అతిసార నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. పక్షోత్సవాల పోస్టర్‌ను ఆమె సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదేళ్ల వరకూ అధికంగా విరేచనాల బారిన పడతారని, వారికి వైద్యుల సూచన మేరకు తగిన చికిత్స అందించాలని అన్నారు. వర్షాకాలం వచ్చే సమయంలో మరింత ఎక్కువగా ఈ నీళ్ల విరేచనాల బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకే ఈ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు వైద్యులు, సిబ్బంది తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. అన్నిచోట్లా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వ్యాధి బారిన పడిన పిల్లలకు తల్లి పాలు మానవద్దని, ఎప్పటికప్పుడు చేతులు సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. ఈ పక్షోత్సవాల్లో అందరూ విధిగా మూడు రోజులు రోటా వ్యాక్సిన్ వేయించుకొనేలా చూడాలని అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కె.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, ఐదేళ్లలోపు పిల్లలున్న ప్రతి ఇంటినీ ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు సందర్శించి, ఓఆర్ఎస్, జింక్ మాత్రలు సరఫరా చేస్తారని తెలిపారు. ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్లు ఏర్పాటు చేశామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎన్.రాజకుమారి తెలిపారు.

ధాన్యోస్మి

- చివరి దశకు రబీ ధాన్యం సేకరణ
- ఇప్పటికే 99.13 శాతం కొనుగోలు
- మిగిలింది వారం రోజుల్లో పూర్తి
- రైతుల ఖాతాల్లో నేరుగా రూ.323.81 కోట్ల జమ
- బిల్లుల చెల్లింపులో రాష్ట్రంలో రెండో స్థానంలో 'తూర్పు'



లారీలో మిల్లుకు ధాన్యం తరలింపు

సాక్షి, రాజమహేంద్రవరం: అకాల వర్షం విపత్తు సమయంలోనూ అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలిచింది. ధాన్యం తడిసిందన్న సాకుతో దళారుల చేతిలో మోసపోకుండా చర్యలు తీసుకుంది. మిల్లర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చేసింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకే ప్రతి గింజా కొనుగోలు చేసింది. పండించిన మొత్తం ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా కృషి చేస్తోంది. సేకరించిన ధాన్యానికి సంబంధించిన బిల్లులను రైతులకు ప్రాధాన్య క్రమంలో చెల్లిస్తోంది. ఫలితంగా రబీ ధాన్యం సేకరణ ఇప్పటికే 99.13 శాతం పూర్తి చేసి, అధికార యంత్రాంగం రికార్డు సృష్టించింది. మూడు మండలాల్లో స్వల్పంగా మినహా, మిగిలిన వాటిలో వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు. 224 రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) వంద శాతం సేకరణ పూర్తయింది. అక్కడక్కడ మిగిలిన కొద్దిపాటి ధాన్యం సైతం కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. వారం రోజుల్లో వంద శాతం లక్ష్యాన్ని అధిగమిస్తామని అధికారులు ధీమాగా చెబుతున్నారు. జిల్లాలో ఈ నెల 15వ తేదీ వరకూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించనున్నారు. అయితే ఈలోగానే 99.13 శాతం కొనుగోలు చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

సేకరించారిలా..

జిల్లావ్యాప్తంగా రబీలో 3,72,533 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. స్థానిక అవసరాలు పోనూ.. 42,955 మంది రైతుల నుంచి 2,73,222 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కూపన్లు జారీ చేశారు. సోమవారానికి 26,384 మంది రైతుల నుంచి 2,41,486 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఆఫ్‌లైన్‌లో మరికొంత కొనుగోలు చేశారు. దీనిని ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. దీంతో పాటు బహిరంగ మార్కెట్‌లో ప్రైవేటు వ్యక్తులకు రైతులు 1,27,886 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటి నుంచీ కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎప్పటికప్పుడు అధికారులు, మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేశారు. ఫలితంగా ఇంకా సమయం మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అధిగమించే స్థితికి చేరుకున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై బురద జల్లేందుకు జిల్లా పర్యటనకు వచ్చిన సమయానికే సింహభాగం కొనుగోళ్లు పూర్తయ్యాయి.

ప్రాధాన్య క్రమంలో బిల్లుల చెల్లింపు

ధాన్యం అమ్మిన రైతులకు బిల్లుల చెల్లింపు సైతం ప్రాధాన్య క్రమంలో చేపట్టారు. 26,384 మంది రైతులకు రూ.429.63 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. 26,112 ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లకు (ఎఫ్‌టీఓ) సంబంధించి రైతుల ఖాతాలకు నేరుగా రూ.323.81 కోట్లు జమ చేశారు. మరో 6,648 ఎఫ్‌టీఓలకు రూ.72.86 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. రెండు మూడు రోజుల్లో ఆయా రైతుల బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఎఫ్‌టీఓలు జనరేట్ చేయడం, బిల్లుల చెల్లింపుల్లో మన జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. మొదటి స్థానాన్ని పశ్చిమ గోదావరి దక్కించుకుంది.

పారదర్శకతకు పెద్దపీట

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ఈ ఏడాది పారదర్శకతకు పెద్దపీట వేసింది. సేకరణలో మిల్లర్ల ప్రమేయాన్ని పూర్తి స్థాయిలో అరికట్టింది. ప్రభుత్వ ఆదేశం మేరకు రైతు పండించిన ప్రతి గింజను ఆర్‌బీకేల ద్వారా నేరుగా కళ్లాల్లోనే కొనుగోలు చేసి, మిల్లులకు తరలించడంతో రైతులకు ఇబ్బందులు తప్పాయి. ధాన్యం రవాణా చార్జీలు సైతం చెల్లించడంతో వారికి మరింత చేదోడు లభించింది. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం ఏం చేయాలి? తక్కువ ధరకు విక్రయించుకోవాలా? అని దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. 30 వేల మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యం కూడా సేకరించడంతో వారికి ఎటువంటి నష్టమూ జరగలేదు.

టీడీపీ హయాంలో అధ్వానం

టీడీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ అధ్వానంగా ఉండేది. తక్కువ సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. తేమ శాతం, తప్ప, తాలు పేరుతో ధాన్యంలో కోత విధించేవారు. సేకరించిన ధాన్యం బిల్లుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి. మిల్లర్లకు వత్తాసు పలకడంతో ప్రభుత్వానికి కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) అందడంలో కూడా ఎనలేని జాప్యం జరిగేది. చేసేది లేక రైతులు తక్కువ ధరకే దళారులకు అమ్ముకునేవారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న పౌరసరఫరాల అధికారులు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఇలా..

మండలం	సేకరించిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో)	సాధించిన లక్ష్యం (శాతంలో)
అనపర్తి	2,317.360	100
బిక్కవోలు	3,845.520	100
చాగల్లు	23,732.840	100
దేవరపల్లి	14,726.200	100
గోకవరం	3,102.480	100
గోపాలపురం	6,027.160	90.20
కడియం	10,448.040	100
కోరుకొండ	3,458.560	100
కొవ్వూరు	26,890.440	100
నల్లజర్ల	9,531.040	100
నిడదవోలు	4,6511.000	100
పెరవలి	19,859.080	100
రాజమహేంద్రవరం రూరల్	1,361.280	100
రాజానగరం	8,999.920	100
రంగంపేట	788.400	100
సీతానగరం	8,279.920	100
తాళ్లపూడి	15,369.240	98.12
ఉండ్రాజవరం	36,237.560	95.99

వంద శాతం లక్ష్యం సాధిస్తాం



ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వంద శాతం లక్ష్యాన్ని సాధిస్తాం. సేకరణ ప్రక్రియ ప్రారంభమైన రెండున్నర నెలల వ్యవధిలోనే 99.13 శాతం కొనుగోలు చేశాం. పారదర్శకతకు పెద్దపీట వేశాం. మిల్లర్లు, దళారుల చేతిలో రైతులు నష్టపోకుండా చూశాం. అకాల వర్షాల సమయంలో ఏ ఒక్క రైతూ అధైర్యపడకుండా తడిసిన ధాన్యాన్ని మిల్లుల్లోనే ఆరబెట్టే ఏర్పాట్లు చేశాం. ఎఫ్‌టీఓలు జనరేట్ చేసిన వారం రోజుల్లోపే 26,112 మందికి రూ.323.81 కోట్లు చెల్లించాం. గోనె సంచుల వినియోగ చార్జీ కింద రూ.3.39 చెల్లించాం. హమాలీ, రవాణా, గోనె సంచుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. మిగిలిన లక్ష్యాన్ని సైతం త్వరలోనే అధిగమిస్తాం.

– ఎస్.తేజ్‌భరత్, జాయింట్ కలెక్టర్

స్పందనకు 89 అర్జీలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందనకు 89 అర్జీలు వచ్చాయి. ప్రజల నుంచి కలెక్టర్ కె.మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆన్‌లైన్‌లో 81, ఆఫ్‌లైన్‌లో 8 అర్జీలు వచ్చాయని తెలిపారు. స్పందనలో వచ్చిన ప్రతి సమస్యను మన కుటుంబ సభ్యుల సమస్యగా భావించి, పరిష్కారం చూపడం ద్వారా అర్జీదారులు సంతృప్తి చెందుతారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ 1902 జేకేసీ ద్వారా స్వయంగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో స్పందన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై మరింత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా కొవ్వూరు మండలం పెద వాడపల్లి గ్రామానికి విభిన్న ప్రతిభావంతుడు ఎస్.లక్ష్మణరెడ్డికి కలెక్టర్ మాధవీలత ట్రై సైకిల్ అందజేశారు. దరఖాస్తు చేసుకొన్న ప్రతి ఒక్కరికీ ఉపకరణాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి బి.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుడికి ట్రై సైకిల్ అందిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

పోలీసు స్పందనకు 41 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందనకు జిల్లా వ్యాప్తంగా 41 ఫిర్యాదులు అందాయి. జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి స్వయంగా అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో సివిల్ 13, కుటుంబ తగాదాలు 1, ఇతరాలు 27 ఉన్నాయి. కుటుంబ కలహాలు, భర్త, అత్తవారింట్లో వేధింపులు, భూ వివాదాలు, ఇతర సమస్యలను అర్జీదారులు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆయన.. వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడారు. బాధితులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి

- నన్నయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పద్మరాజు
- ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పద్మరాజు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యాన స్థానిక కంబాలచెరువు పార్క్ నుంచి శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం వరకూ సోమవారం గ్రీన్ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం కళాకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయాలు వాడాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఉద్దేశించిన 'మిషన్ లైఫ్' కార్యక్రమం ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రజలందరూ పర్యావరణ హిత జీవనాన్ని అలవరచుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ అధికారి నాగరాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధించిందని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ విధానం అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ అటవీ విశ్రాంతి అధికారి ప్రసాదరావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు మహాలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు జేఏఓ పీవీఎస్ చలం, ఏఈఈ మీరా సుభాన్ షేక్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పద్మరాజు తదితరులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని కలెక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్‌తో కలసి ఆమె కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మానవాళి మనుగడకు ప్రాణవాయువును అందించేందుకు మొక్కలు ఎంతో ఉపయోగపడతాయని, వాటిని నాటి, సంరక్షించడం ప్రతి ఒక్కరి వ్యక్తిగత బాధ్యతని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ జి.నరసింహులు, జిల్లా హౌసింగ్ అధికారి జి.పరశురామ్, పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్‌టీడీవీ సత్యగోవిందం, హార్టికల్చర్ అధికారి వి.రాధాకృష్ణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు ఈదురు గాలుల షాక్

- కూలిన 54 స్తంభాలు
- 38 చోట్ల తెగిపడిన విద్యుత్ వైర్లు
- 12 ట్రాన్స్‌ఫార్మర్లకు పాక్షిక నష్టం

కొవ్వూరు: అకస్మాత్తుగా వీచిన బలమైన ఈదురు గాలులు విద్యుత్ శాఖకు షాక్ ఇచ్చాయి. ఆదివారం రాత్రి వీచిన పెను గాలుల ప్రభావంతో నిడదవోలు డివిజన్ పరిధిలోని గోపాలపురం, చాగల్లు మండలం కలవలపల్లి, ఉండ్రాజవరం మండలం మోర్తా తదితర ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురు గాలులకు 54 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 12 ట్రాన్స్‌ఫార్మర్లకు పాక్షికంగా నష్టం వాటిల్లింది. 38 ప్రాంతాల్లో తీగలు తెగి పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఏపీఈపీడీసీఎల్ ఇన్‌చార్జి ఈఈ పి.అచ్యుతాచారి తెలిపారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మూడు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆదివారం రాత్రి సరఫరాను పునరుద్ధరించారు. పెను గాలులకు దెబ్బ తిన్న లైన్లను సోమవారం మధ్యాహ్నానికి పునరుద్ధరించామని అచ్యుతాచారి తెలిపారు. మరో పక్క ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. మంటలు ఎగసిపడటంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పెను గాలుల ప్రభావంతో విద్యుత్ శాఖకు డివిజన్‌లో సుమారు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశామని ఈఈ అచ్యుతాచారి తెలిపారు.



పెను గాలులకు దెబ్బ తిన్న ట్రాన్స్‌ఫార్మర్లు

పోలవరం జాప్యం చంద్రబాబు పుణ్యమే..

- నేడు పరిశీలించనున్న సీఎం జగన్
- ఎంపీ మార్గాని భరత్‌రామ్ వెల్లడి

రాజమహేంద్రవరం సిటీ: చంద్రబాబు నాయుడి అనాలోచిత నిర్ణయాల వల్లనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతోందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు మొబైల్ వాటర్ ట్యాంకర్లను ఆయన అందజేశారు. స్థానిక దేవీచౌక్‌లోని అమ్మవారి ఆలయం వద్ద సోమవారం పూజలు నిర్వహించి, ఈ ట్యాంకర్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సాంకేతిక అవగాహన లేమితో, తొందరపడి నిర్మించిన కొన్ని కీలక కట్టడాల వల్ల పోలవరం నిర్మాణ పనులు మొదటికొచ్చాయని చెప్పారు. నిపుణులైన ఇంజినీర్లతో, కేంద్రంలోని పెద్దలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమగ్రంగా చర్చించి, అందుకు తగ్గట్టు మార్పులు చేయాల్సి వస్తోందని చెప్పారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ నిర్మాణాలు పూర్తయ్యాయని, వీటి మధ్యలో ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ కట్టబోతున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల డయాఫ్రం వాల్ దెబ్బ తిందన్నారు. వీటన్నిటినీ పరిశీలించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిశీలనకు వస్తున్నారని వెల్లడించారు. కేంద్రం నుంచి నిధులు రాబోతున్నాయని, పోలవరం పనులు వేగవంతమవుతాయని చెప్పారు. డబుల్ డయాఫ్రం వాల్ దెబ్బతిన్న చోట సాంకేతికపరంగా తీసుకోవాల్సిన చర్యలపై సాంకేతిక నిపుణులతో సీఎం చర్చిస్తారన్నారు. కాగా, ఒడిశా రైలు ప్రమాద ఘటనపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చాలా వేగంగా స్పందించి, అప్రమత్తం చేశారని భరత్‌రామ్ అన్నారు. త్వరలో డీఎస్సీ ప్రకటించనున్నారని, సీపీఎస్ రద్దుపై సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. మహానాడు జరిగాక టీడీపీ డొల్లతనం బయటపడిందని, ఇక లాభం లేదని కేంద్రంలోని పెద్దలను ప్రాధేయపడటానికే చంద్రబాబు ఢిల్లీ వెళ్లారని ఎద్దేవా చేశారు. పవన్‌కు రాజకీయాలు పార్ట్ టైమ్ జాబ్ అని, ఆయన ఏ పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నారో తెలియని పరిస్థితి అని విమర్శించారు.

ఎంపీ నిధులతో 15 మొబైల్ వాటర్ ట్యాంకర్లు

పార్లమెంటరీ నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సుమారు రూ.1.45 కోట్ల ఎంపీ నిధులతో 15 మొబైల్ వాటర్ ట్యాంకర్లు కొనుగోలు చేశామని ఎంపీ భరత్‌రామ్ తెలిపారు. రాజమహేంద్రవరం సిటీకి 3, రూరల్, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, రాజానగరం, గోపాలపురం నియోజకవర్గాలకు రెండేసి చొప్పున ట్యాంకర్లను అందిస్తున్నామని వివరించారు. ఒక్కో ట్యాంకర్ 4 వేల లీటర్ల సామర్థ్యంతో ఉంటుందని, రోజుకు పది ట్రిప్పుల చొప్పున ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో నీరు సరఫరా చేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నేతలు సంకిస భవానీప్రియ, మిండి నాగేంద్ర, బర్రే కొండబాబు, నక్కా నగేష్, మార్తి లక్ష్మి, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్, ఎంహెచ్ఓ వినూత్న, ఈఈ కనకారావు పాల్గొన్నారు.



కొబ్బరి కాయ కొట్టి ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్‌రామ్

సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు


చురుగ్గా సాగుతున్న మలికిపురం- విశ్వేశ్వరాయపురం రోడ్డు పనులు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో ఈ నెల 7వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 7వ తేదీన తన కుమారుడు రాపాక వెంకటరామ్ వివాహం మలికిపురం మండలంలోని కత్తిమండ గ్రామంలో తన నివాసం వద్ద జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌ను ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే రాపాక అన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్ నిర్మాణంతో పాటు పలు రోడ్లను కూడా నిర్మిస్తున్నారు.

భారీగా చదివింపులు

- పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన
- పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 21 కోర్సులకు అవకాశం

రాయవరం: పేద విద్యార్థుల సంక్షేమానికి పలు పథకాలను అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విదేశాల్లో చదువుకునే వారికి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తోంది. విదేశాలకు వెళ్లి చదువుకునే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అధికంగా రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ.కోటి వరకు మంజూరు చేయనుంది. అర్హులైన విద్యార్థులకు పథకం అందించే క్రమంలో భాగంగా పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి జిల్లా నోడల్ అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వ్యవహరిస్తున్నారు. పేద విద్యార్థులంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

టాప్ 50 యూనివర్సిటీల్లో చదివే అవకాశం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న 379 యూనివర్సిటీ/ఇనిస్టిట్యూషన్లలో లేటెస్ట్ క్యూఎస్ రేటింగ్ ఆధారంగా టాప్ 50లో నిలిచిన యూనివర్సిటీ/ఇనిస్టిట్యూషన్లలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన పేద విద్యార్థులు పీజీ లేదా పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు చదువుకునేందుకు ప్రభుత్వం ఆర్థికంగా తోడ్పాటునందిస్తోంది. ఆయా కోర్సులకు సంబంధించిన అవసరమైన విద్యార్హతల్లో కచ్చితంగా 60 శాతం మార్కులు పొందిన వారినే పరిగణలోకి తీసుకుంటారు. ఎంబీబీఎస్ అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పనిసరిగా దేశ వ్యాప్తంగా నిర్వహించే నీట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించాలి. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు హెచ్‌టీటీపీ://జ్ఞానభూమి.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వారి అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తారు.



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

ఈ కోర్సులకే అనుమతి

అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ, ఆర్కిటెక్చర్ అండ్ బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, ఆర్ట్ అండ్ డిజైన్, ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్, బయోలాజికల్ సైన్స్, బిజినెస్, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్ అండ్ మీడియా స్ట్రాటజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్, ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ మినరల్స్ అండ్ మైనింగ్, ఇంజినీరింగ్-పెట్రోలియం, హాస్పిటాలిటీ అండ్ లీజర్ మేనేజ్‌మెంట్, లా, మెడిసిన్, నేచురల్ సైన్స్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ.

జూన్ 10 వరకు గడువు



జగనన్న విదేశీ విద్యాదీవెనకు అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 10 వరకు దరఖాస్తుకు గడువు ఉంది. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8లక్షలకు మించకుండా 35 ఏళ్ల వయసులోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉన్నత చదువులు చదువుకోవాలనే పేద విద్యార్థులకు ఈ పథకం ఒక వరం లాంటిది.

– డి.వి.రమణమూర్తి, జాయింట్ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ, కాకినాడ

దివ్యాంగులకు పరికరాల అందజేత


దివ్యాంగులకు చంక కర్రలు, చేతికర్రలు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దివ్యాంగులకు ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఉచితంగా చంక కర్రలు, చేతి కర్రలు, సైలెంట్ వాకర్స్‌లను కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం పంపిణీ చేశారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఆశ్రయ వికలాంగుల సమాఖ్య సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు సురేష్ మాట్లాతూ ముగ్గురు ఐఐటీ చేసిన యువకులు ఫ్లెక్సీమో అనే కంపెనీని స్థాపించి వినూత్న పద్ధతిలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలు తయారు చేస్తున్నారన్నారు. వాయిస్ ఆఫ డిసేబిలిటీ సంస్థ సీఎస్ఆర్ సహకారంతో జిల్లాలో ఉన్న అందరికీ దివ్యాంగులకు అందజేయాలి అనేది ఆశయమన్నారు. మంగళవారం తూరంగి అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో ఉన్న ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య సంస్థ కార్యాలయంలో మిగిలిన వారికి పరికరాలను ఉచితంగా అందిస్తామన్నారు. దివ్యాంగులకు అవసరమైతే తమ సంస్థను సంప్రదిస్తే కొలతలు తీసుకొని ఉచితంగా అందజేస్తామని సురేష్ వివరించారు. ఈ సంవత్సరంలో 100 మందికి ఈ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు.

శిక్షణతో పరిపాలనపై అవగాహన

ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్


జెడ్పీటీసీ సభ్యులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్


సామర్లకోట: జెడ్పీటీసీ సభ్యులకు ఇస్తున్న శిక్షణతో వారికి పరిపాలనపై అవగాహన పెరుగుతుందని విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) ప్రిన్సిపాల్, డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండవ బ్యాచ్‌కు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు మూడంచెల విధానంలో ఆయా సమావేశాల్లో పాల్గొనే హక్కు, అధికారం జెడ్పీటీసీ సభ్యులకు ఉంటుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుకు దూసుకుపోవడం ద్వారా మంచి ప్రజా ప్రతినిధులుగా గుర్తింపు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇందుకు అవసరమైన సలహాలు, సూచనలు శిక్షణలో ఇస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్ మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యుల హక్కులు, బాధ్యతలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈటీసీ ఫ్యాకల్టీలు శ్రీదేవి, ఎంఎస్ఎన్‌రెడ్డి, నిహారిక, ప్రసాద్ పంచాయతీరాజ్ చట్టం, జిల్లా ప్రజాపరిషత్తుల ఏర్పాటు, సభ్యుల ఎంపిక, పదవీ కాలం, రాజీనామా, జిల్లా ప్రజాపరిషత్తు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల విధులు, అధికారాలు, బాధ్యతలు, స్థాయీ సంఘాల ఏర్పాటు, సమావేశాల నిర్వహణ, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం, జిల్లా పరిషత్తు బడ్జెట్ అంశాలపై మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ హెచ్‌ఓడీగా నాగకుమార్



అనపర్తి: జాతీయ స్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించే ఐదు క్రీడాంశాల నిర్వహణకు హెచ్ ఆఫ్ డెలికేషన్ హెచ్‌ఓడీగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ పీడీ ఆర్.నాగకుమార్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నల్లమిల్లి సత్తిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 66వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఈ నెల 6 నుంచి 12 వరకు ఢిల్లీలో జరగనున్నాయని చెప్పారు. 13 క్రీడాంశాల్లో జరిగే ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే షూటింగ్, చదరంగం, యోగాసన, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో ఐదు క్రీడాంశాలకు సంబంధించి హెచ్‌ఓడిగా నాగకుమార్ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

అదిరిన 'సన్నాయి పాట'


వేలం నిర్వహిస్తున్న దేవస్థానం ఏసీ రమేష్ బాబు, ట్రస్టీ ధళే సూర్యనారాయణ, అధికారులు

- రత్నగిరిపై మార్మోగిన సన్నాయి మేళం లైసెన్స్ వేలం
- నెలకు రూ.18,00,116కు టెండర్ ఖరారు
- ఏడాదికి రూ. 2.16 కోట్ల ఆదాయం

అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో జరిగే వివాహాలు, ఉపనయనాలు, ఇతర శుభకార్యక్రమాలలో వాయించే సన్నాయి మేళం లైసెన్స్‌కు సోమవారం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా రికార్డు స్థాయిలో వేలం ఖరారైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నెలకు రూ.18,00,116కు టెండర్ ఖరారైంది. రెండేళ్ల కాలపరిమితికి గాను ఈ వేలం కం టెండర్ నిర్వహించారు. ఖరారైన టెండర్ ద్వారా మొదటి సంవత్సరం రూ.2.16 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉండగా, రెండో సంవత్సరం ఈ మొత్తంపై పది శాతం అదనంగా పాటదారుడు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రెండు సంవత్సరాలకు కలిపి రూ.4.54 కోట్ల ఆదాయం రానుంది. ఖరారైన టెండర్ మొత్తంపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.

తొలుత వేలంపాట నిర్వహించగా నెలకు రూ.11 లక్షల వరకు పాట వెళ్లింది. అదే అత్యధిక మొత్తంగా అధికారులు భావించారు. ఆ తరువాత టెండర్ బాక్స్ ఓపెన్ చేయగా నెలకు రూ.18,00,116కు టెండర్ కోట్ చేయడంతో దానిని ఖరారు చేశారు.

దేవస్థానంలో అత్యధిక వేలం పాట ఇది

అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని అన్ని వ్యాపారాలలో అత్యధిక మొత్తంలో ఖరారైన వేలం పాట ఇది. ఇంత మొత్తంలో వేలం ఖరారవుతుందని దేవస్థానం వర్గాలు కూడా ఊహించలేదు. సాధారణంగా దేవస్థానంలో భక్తులు మొక్కు చెల్లించిన తలనీలాలు (జుత్తు) వేలం పాట రూ. కోట్లలో ఖరారవుతుంటుంది. రెండు, మూడేళ్లుగా తల నీలాల వేలం పాట కూడా రూ.రెండు కోట్లు దాటలేదు. ఎనిమిదేళ్ల క్రితం ఇదేవిధంగా వేలం నిర్వహించగా మొదటి సారి ఏడాదికి రూ.పది లక్షలు, రెండో సారి ఏడాదికి రూ.రూ.55 లక్షలకు వేలం పాట వెళ్లింది. ఇప్పుడు ఏకంగా ఏడాదికి రూ.2.16 కోట్లకు ఖరారైంది. దేవదాయశాఖ కమిషనర్ అనుమతి తీసుకుని పాటదారునికి లైసెన్స్ మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్ బాబు, ఏఈఓ జగ్గారావు, సూపరింటెండెంట్‌లు కంచి మూర్తి, కాపారపు శివ తదితరులు ఈ వేలం నిర్వహించారు. దేవస్థానం ట్రస్టీ ధళే వీర సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లిపై కొడుకు దాడి

తుని: కనిపెంచిన మాతృమూర్తిపై దాడి చేసిన ఘటనపై తుని పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ కె.సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు శిల్పారిశెట్టి జగన్మోహన్ తన తల్లి నూకరత్నంపై సోమవారం కర్రతో దాడి చేసి గాయపరిచాడు. ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్న నూకరత్నం డ్వాక్రా సంఘంలో సభ్యురాలు. గ్రూపు సభ్యుల్లో తనకు వచ్చిన రూ.50 వేలు నగదును కొడుకు జగన్మోహన్‌కు గతంలో ఇచ్చింది. తనకు సొమ్ము అవసరం ఉందని కొడుకును ఇంటికి వెళ్లి అడిగింది. దీంతో జగన్మోహన్ దురుసుగా గెంటి వేసి తర్వాత కర్రతో దాడి చేయడంతో నూకరత్నం గాయపడింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ సూరిబాబు తెలిపారు.

మూడున్నరేళ్ల బాలికపై కామాంధుడి దారుణం

ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

కాకినాడ రూరల్: కాకినాడ ముత్తానగర్‌లో కుటుంబంలోని మూడేళ్ల చిన్నారిపై సమీపంలోని నివాసం ఉంటున్న కామాంధుడు దారుణానికి ఒడిగట్టాడు. ఇంట్లో ఉన్న చిన్నారిపై 48 ఏళ్ల రామకృష్ణ అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో తల్లిదండ్రులు గమనించి ఆందోళన వ్యక్తం చేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత చిన్నారి తల్లి వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో ఇంద్రపాలెం ఏఎస్సై రాంబాబు నిందితుడిపై పోక్సో, అత్యాచార చట్టం కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు దిశ స్టేషన్ పరిధిలోకి రావడంతో కేసును దిశ స్టేషన్‌కు బదలాయించారు. దిశ డీఎస్పీ కేసు విచారణ చేపట్టనున్నట్టు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ ఏటిమొగకు చెందిన మత్స్యకార కుటుంబం ముత్తానగర్‌లో కాపురం ఉంటుండగా అదే మత్స్యకార కుటుంబానికి చెందిన రామకృష్ణ కుటుంబం కూడా పక్కనే నివాసం ఉంటోందన్నారు. చిన్నారిని అప్పుడప్పుడూ ఆడిస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో చిన్నారిని ఆడిస్తూ తన ఇంట్లోకి తీసుకువెళ్లాడు. ఆ సమయంలో రామకృష్ణ భార్య బయట పనిచేసుకుంటుందని, ఈ సమయంలోనే 48 ఏళ్ళ రామకృష్ణ అఘాయిత్యానికి పాల్పడ్డాడని చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా కేసు నమోదు చేశామని, బాలికలను ప్రభుత్వాస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం పంపించామన్నారు.

నేడు ఐటీఐ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నవారు తమ సర్టిఫికెట్లను మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలి. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఐటీఐ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కాకినాడ లేదా జగ్గంపేటలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఏదో ఒకచోట తమ సర్టిఫికెట్లు వెరిఫై చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ సమయంలో ఆన్‌లైన్ నమోదు పత్రం, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోని వారు అడ్మిషన్‌కు అనర్హులని స్పష్టం చేశారు.